
# గ్లోబల్ గ్రామం

వెంకటేష్. సి





*ఎప్పటిలాగే సాయంత్రమయ్యేసరికి శీనయ్య, బాబయ్య చింతచెట్టు కింద చేరారు.*

*"ఒరే బాబయ్యా! ఎంత ఘోరం జరిగిపోయిందో చూశావా. సాక్షాత్తూ మనూరి జాజికాయల భూషయ్యగారింటి మీద దాడులు జరిగాయి. ఇట్టాంటి ఘోరం ఎప్పుడూ వినలేదురా అబ్బాయ్"*

"ఔను శీనన్నా, మహా ఘోరం. ఆయనింటిమీదే కాదు. పేలుడు పదార్థాలు చేసే పెంటపాడులోని ఆయన ఫ్యాక్టరీ మీద కూడా ఎటాకయిందంటగా."

"ఔన్రా అబ్బాయ్. ఇలా జరుగుతుందని ఎప్పుడైనా ఊహించామా. భూషయ్యగారంటే ఊరికి మేయరు మాత్రమేకాదు, ఊరంతటికీ పెద్ద దిక్కు. రాజశేఖరపురం కార్పొరేటరు పున్నయ్యగారు దివాలా తీసినప్పటినుంచి ఆయనకసలు ఎదురులేకుండానే ఉంది మరి. డబ్బులు వెదజల్లో లేపోతే రౌడీయిజం చేసో తనకు కావల్సిన పని చేసుకోగల సత్తా వున్నోడు గదంట్రా"

"ఐనా శీనన్నా, ఆయనకు శత్రువులకేం కొదవ. ఎవరో తెలీదుగానీ పట్టపగలే భూషయ్యగారి జీపుల్లోనే ఆయనింటిమీద, ఫ్యాక్టరీ మీద దాడి చేశారంటగా"

"ఔన్రా. పక్కూరి నుంచి వస్తుంటే భూషయ్యగారివే రెండు టాటానుమోలు అటకాయించారు. లేపోతే ఆయనింటి దగ్గరగానీ, పెంటపాడు ఫ్యాక్టరీ దగ్గరగానీ ఎంత సెక్యూరిటీ ఉంటాదో నీకు తెలుసుగా. సొంత జీపులేకదాని సెక్యూరిటీవోళ్లు లోపలికి వదిలారు. దాంతో జరగరానిది జరిగిపోయింది"

"అయితే శీనన్నా, ఇంటి మీద జరిగిన దాడిలో ఎవరికీ గాయాలవలేదంటగా. ఫ్యాక్టరీలో మాత్రం ఐదుగురు వర్కర్లు చనిపోయారని విన్నాను"

"అంతేరా బాబయ్యా, ఇంటిమీద రాళ్లతో మాత్రమే దాడి జరిగింది. ఆ రాళ్ల దెబ్బలకి ఐదారు అద్దాలు పగిలాయి. భూషయ్యగారి బెంజికారు అద్దాలు కూడా పగిలాయట. ఓ రాయి తగిలి ఆయన పెంపుడుకుక్క కాలు విరిగిందట కూడా. ఫ్యాక్టరీలో ఓ మోస్తరు బాంబు విసిరారు కాబట్టి ఐదుగురు పోయారు. అదృష్టంకొద్దీ పేలుడు పదార్థాల ఫ్యాక్టరీ అయినా తగలబడిపోలేదు"

"ఇంతకీ అసలు విషయం చెప్పన్నా. ఇదంతా ఎవరు చేశారంటావ్. ఆ బీరం లచ్చిగాడేనా"

"నా అనుమానం కూడా బీరం లక్ష్మయ్య మీదే ఉంది. అప్పుడే ఏం చెప్పలేం. నువ్వు కూడా ఫలానా వాడని అప్పుడే ప్రచారం చెయ్యబాకు"

** ** **

మర్నాడు మళ్లీ శీనయ్య, బాబయ్య చింతచెట్టు కింద చేరారు.

"ఒరే బాబయ్యా, దాడులు చేసింది బీరం లక్ష్మయ్యే నని తేలిపోయినట్టేరా. భూషయ్యగారు కూడా ఆడి పేరే చెబుతున్నారు"

"ఔనన్నా, లక్ష్మయ్యగాడు తానేదో పెద్ద మాఫియా లీడర్నని అనుకుంటాడు. ఇప్పటికీ పోలీసులకు దొరక్కుండ ఊరిపక్కని అడవిలో దాక్కున్నాడు. మరి వాడిప్పుడు చిక్కుతాడంటావాన్న"

"కష్టమేకాని బాబిగా, వాడు, వాడి తాలింఖానా గ్యాంగూ అన్నింటికీ తెగించినోళ్లు. అయినా భూషయ్యగారు ఊరుకుంటారా. అంత పెద్ద మనిషికి ఓ చిన్న గూండాగాడి చేతిలో దెబ్బ తినడం ఎంత అవమానం. ఎలాగైనా వగ తీర్చుకోవాలని ఆయన చిందులు తొక్కుతున్నాడంట. ఏదో శాస్త్రానికన్నట్టుగా పోలీసు కమిషనరు కాషీల అన్నమయ్యగారికి బీరం లక్ష్మయ్యమీద రిపోర్టిచ్చాడంట. కానీ భూషయ్యగారి మనుషులే ఆడి భరతం పడతారు చూస్తుండు."

"అంతేగదన్నా, భూషయ్యగారు తలుచుకోవాలేగానీ ఆడినీ, ఆడి తాలింఖానా గ్యాంగునీ రెండు నిముషాల్లో మట్టుపెట్టేయగలరు. అయితే మనలో మన మాటన్నా, ఈ లక్ష్మయ్యగాడు కూడా ఒకప్పుడు భూషయ్యగారి గ్యాంగులోని వాడేగా."

"గట్టిగా అనకురా బాబిగా, అది అందరికీ తెలిసిన సంగతే. భూషయ్యగారి గ్యాంగులో ఉండే ఆడు రౌడీయిజం, రాళ్లు రువ్వడం, బాంబులేయడం నేర్చుకున్నాడు. అయితే ఎక్కడో బెడిసింది. ఇప్పుడాడు అప్పానగరం కాలనీలోని తోటి ఎస్సీలతో కలిసి తాలింఖానా గ్యాంగు నడుపుతున్నాడు. పెద్దాయనతో అడపాదడపా ఏదో విషయంలో లక్ష్మయ్యకు గొడవొస్తానే ఉంది. అయితే క్రితం ఏడాది భూషయ్యగారి కొడుకు గెస్ట్ హౌస్‌లో తప్పతాగి లక్ష్మయ్యగాడి చిన్నాన్న కూతుర్ని రేప్ చేశాడే, అప్పట్నించీ పగ బాగా రగులుకుంది."

"ఏమైతేనేం భూషయ్యగారి లాంటి పెద్దమనిషికి అవమానమైపోయింది. తన వేలుతో తన కన్నే పొడుచుకున్నట్టయింది"

"ఒరే బాబిగా, నీ నోరసలే మంచిదికాదు. లచ్చిగాడు ఒకప్పుడు భూషయ్యగారి మనిషేనని ప్రచారం చెయ్యబాకు."

** ** **

నాలుగు రోజుల తర్వాత మళ్లీ శీనయ్య, బాబయ్య చింతచెట్టు కింద చేరారు. ఇద్దరూ బాగా తాగి ఉన్నారు.


"ఒరే బాబిగా, చూశావా, భూషయ్యగారు చేతులు కట్టుకుని కూచోరని అర్థమయిందా. తన ఇంటిమీద, ఫ్యాక్టరీమీద జరిగిన దాడులకు అంతకు అంత ప్రతీకారం తీర్చుకోడానికి అన్నీ సిద్ధం చేశారు. ఊరంతా ఆయనకు సపోర్టు చేయాలని మొన్న సిటీకేబుల్లో మాట్లాడారు. అప్పుడాయన కళ్ళల్లో నీళ్లు కూడా తిరిగాయి. బీరం లక్ష్మయ్య, ఆడి నేస్తం ముత్తా ఉమాశంకర్ కలిసి నగరంలో అరాచకం సృష్టిస్తున్నారని గూండాయిజాన్ని రూపుమాపేదాకా తాను నిద్రపోనని ఢంకా బజాయించి చెప్పారు. గూండాయిజంపై పోరాటంలో తనకు అందరూ సహకరించాలన్నారు. 'మాతో కలిసి పోరాడండి, లేపోతే మాకు వ్యతిరేకంగా పోరాడండి, మౌనంగా ఉండడం మాత్రం కుదర్దు' అని తెగేసి చెప్పారు. ఇగ జూస్కో, ఊరు ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోతాది"

"సరే శీనన్నా, మరి ఆ లక్ష్మయ్యగాడేమో ఎప్పటినుంచో పోలీసులకు చిక్కకుండా పక్కనున్న అడవిలో దాక్కున్నాడాయె. అక్కడ ఆడిని పట్టడం బ్రహ్మతరం కూడా కాదు. మరి భూషయ్య దొరగారు ఏంచేస్తారు"

"ఆయన మరీ అమాయకుడేంట్రా, ఊరికే పోలీసు కంప్లైంటు ఇచ్చాడుగానీ మాఫియా గ్యాంగుల్ని పట్టడం పోలీసుల వల్ల కాదని ఆయనకు తెలీదేంటి. ఆయన దగ్గర పెద్ద ప్రైవేటు సైన్యం ఉందిగా. ఆ సైన్యాన్ని రంగంలోకి దించుతాడు. ముఖ్యంగా అప్పానగరం ఎస్సీల కాలనీలోనే లచ్చిగాడి స్థావరాలున్నాయి. నగరంలో క్యాంపేసినపుడు ఆ బస్తీ జనాలే ఆడికీ, ఆడి తాలింఖానా గ్యాంగుకు ఆశ్రయం ఇస్తారు. అందుకే అప్పానగరం కాలనీ మీదే భూషయ్యగారి గురి ఉంటుంది. అక్కడా, మిగతా నగరంలోనూ బీభత్సం సృష్టిస్తాడు. తన మనుషుల్ని రక్షించుకోడానికైనా లచ్చిగాడు లొంగిపోక తప్పదు"

"అంటే అన్నా, కలుగులో పొగబెట్టి ఎలకల్ని బయటకు లాగడం అన్నమాట. మరన్నా, గూండాల్ని చెదరగొట్టడానికని చెప్పి ఊరంతా అల్లకల్లోలం చేస్తుంటే జనాలు ఊరుకుంటారా?"

"అందుకే గదంట్రా ఆయన ఊరి పెద్దలందరి సపోర్టు అడుగుతున్నాడు. ఇప్పటికీ ఊరిలో సగం




మందికి ఆయన చెప్పిందే వేదం. మిగతావాళ్లు కూడా ఇప్పుడాయన దారిలోకి వచ్చేస్తున్నారు చూడు. ముఖ్యంగా పాకనూరుపేట ఎస్సీల కాలనీ వాళ్లని భూషయ్యగారు తనవైపు తిప్పుకోగలిగారు. పాకనూరు పేటోళ్లకి, తాలింఖానా గ్యాంగుకి చాలా దగ్గర సంబంధాలున్నాయి. లచ్చిగాడి రహస్యాలు రాబట్టడానికి వాళ్లు బాగా పనికొస్తారు. తమ కులపోళ్లకి వ్యతిరేకంగా పనిచేయడం కాలనీవోళ్లందరికీ ఇష్టం లేకపోయినా కూడా వాళ్ల నాయకుడు పర్వాజుల ముసలయ్య మాత్రం భూషయ్యగారికి పూర్తి సపోర్టు ప్రకటించాడు.

"ఆళ్లేకాదన్నా, పాకనూరుపేటలో ఎప్పుడూ భూమి తగాదాలుపడే భరత్‌నగర్ కాలనీ బీసాలు కూడా భూషయ్యగారికి ఆయన అడిగీ అడగకముందే వత్తాసు పలుకుతున్నారు. ఆ కాలనీలో జనాన్ని ముంచేసిపోయిన నాస్తి ఫైనాన్స్ కంపెనీ వోళ్లని కూడా పట్టుకోలేకపోతున్నారుగానీ లక్ష్మయ్యగాడిని పట్టడానికి సహాయం చేస్తామని పిలవని పేరంటంగా వాళ్ల నాయకుడు అట్టల వాచస్పతి తెగ హామీలిచ్చేస్తున్నాడు."

"ఆళ్లేకాదురా, మొన్నమొన్నటి వరకూ భూషయ్యగారి మీద ఎన్నికల్లో పోటీచేసిన బద్ధవిరోధి రాజశేఖరపురం కార్పొరేటరు పున్నయ్య కూడా ఇప్పుడు నేనూ మీ పక్షమే అంటున్నాడు. పాపం ఆర్థికంగా బాగా చితికిపోయిన తర్వాత ఆయనకు మందీమార్బలం లేకుండా పోయింది. అందుకే ఆయన సపోర్టు పెద్ద లెక్కలోకి రాదు."

ఓరి పిచ్చోడా, బీరం లక్ష్మయ్య దొరికాడా లేదా అన్నది సమస్యకాదు. ఊరి మీద భూషయ్యగారి పట్టు సడలలేదని నిరూపించడం ముఖ్యం. ఆయనకు కోపం తెప్పిస్తే ఎన్ని కష్టాలొస్తాయో అప్పానగరంకే కాదు ఊరంతటికీ తెలిసొచ్చింది. పనిలో పనిగా తన పెంటపాడు ఫ్యాక్టరీలో తయారైన మందుగుండు సామాను సరిగ్గా పని చేస్తున్నాయో లేదో టెస్టు చేసుకున్నారు

"ఇంకా సిటీలోని మిగతా ఎస్సీ కాలనీలు, ముఖ్యంగా వాటిల్లో కాస్త పచ్చగా ఉన్న కాలనీలు కూడా కులాన్ని పక్కనపెట్టి భూషయ్యగారికి వత్తాసు పలుకుతున్నాయి. అలాగే మా కులపోడు, డిప్యూటీ మేయరు తోనం బైరన్న కూడా తన ప్రైవేటు సైన్యంతో సహా భూషయ్యగారికి అండగా ఉన్నాడు."

"అవును తోనం బైరన్న తెగ రెచ్చిపోతున్నాడు. లేకపోతే తన పరపతి తగ్గుతుందనేమో. లక్ష్మయ్యగాడు తర్వాత ఆయనపైనే గురిపెడతాడేమో. మొత్తం మీద భూషయ్యగారు, బైరన్న కలిసి వీరదౌత్యం నెరపి తమ పోరాటం ఏ కులంపైనా కాదని గూండాయిజంపైనేనని సర్టిఫికేటు సంపాదించేసుకున్నార్రా"

"అయితే మనలో మన మాటన్నా, భూషయ్యగారి పెద్దరికం మీద లోపల్లోపల ఎంత అయిష్టం వున్నా ఇంతమంది పెద్దలూ ఆయన పంచనే ఎందుకు చేరారంటావూ"

"నీకు తెలీదేంట్రా, భూషయ్యగారు డబ్బులున్నోడు, పలుకుబడున్నోడు. ఆయన పక్కన చేరితేనే కదా ఎవరికైనా ఫాయిదా. ఆయన ఛైర్మన్‌గా వున్న వరదరాజుల గ్రామీణ బ్యాంకు నుంచి ఈళ్లందరూ అప్పులు తీసుకున్నోళ్లే. తనకు వత్తాసు పలికినోళ్లకి అప్పులు, వడ్డీలు మాఫీ చేస్తాడు. ఎదురుతిరిగితే కాబూలీవాలాలాగ వసూలు చేస్తాడు. అంతేకాదు, ఆయనకు పేలుడు వస్తువుల ఫ్యాక్టరీ వుందిగా. వూర్లోని కాలనీ గ్యాంగులకు మందుగుండు సామాను, డిటొనేటర్లు కూడా సీక్రెట్‌గా అందిస్తుంటాడు. అందుకే అందరూ ఆయన పక్షమే. ఇంతకుముందు ఆయన గ్యాంగు చేతిలో చావుదెబ్బ తిన్న సద్దావుల హనుమయ్యలాంటి వాళ్లు మాత్రమే ఆయన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈమాటలన్నీ మనిద్దరి మధ్యనే సుమా"

"సర్లేన్నా, నాకు ఆ సంగతి తెలీదా. ఇవన్నీ పదిమందికీ చెబుతానేంటి. అసలు ఇప్పటికీ మనిద్దరం భూషయ్య దొరగారికి కొమ్ముకాస్తున్నామని జనం గుసగుసలాడుకుంటున్నారు. వార్తలు ప్రచారం చేయడంలో మనం టీవీ చానెళ్లని మించిపోయామంటున్నారు"

"ఏ పనీపాటాలేని మనిద్దరం ఏదో ఇక్కడి వార్తలు అక్కడ చేరేస్తూ కాలం గడిపేస్తున్నామంటే అదంతా భూషయ్యగారి చలవ కాదంట్రా. ఆయన దయతోటే రోజుకింత తిని, ఇంత తాగగలుగుతున్నాం. అందుకే ఈ మాటలన్నీ మన మధ్యనే ఉండాలి. బయటికి మాత్రం గూండాయిజం వల్ల జనానికి జరుగుతున్న నష్టాల్ని చెబుతూపోవాలి. గూండాగిరీని అరికట్టడానికి భూషయ్యగారు ఎలా కంకణం కట్టుకున్నారో ఎలుగెత్తి చాటాలి."

"అంతేగదన్నా, ఏదో తాగినప్పుడు నోటినుంచి నిజాలొస్తాయిగానీ జనం ముందు ఇవన్నీ వాగుతానా. భూషయ్యగారి పోరాటం ఓ పెద్ద విప్లవమని కోడైకూయనూ"

"సరేగానీ, భూషయ్యగారి ఎదురుదాడి మొదలయ్యేటట్టుంది. కాస్త జాగ్రత్తగా ఉండు. విషయాలు తెలుసుకోవాలని మరీ దూసుకుపోకు"

"అలాగేనన్నా. నువ్వు భూషయ్యగారికి మరీ దగ్గర గనుక అన్ని వివరాలూ నీ కాళ్ల దగ్గరకొస్తాయి. నాకలా కాదుగా"

** ** **

కొన్నాళ్లకి మళ్లీ శీనయ్య, బాబయ్య చింతచెట్టు కిందకు చేరారు. వాళ్ల ముఖాలు సంతోషంతో వెలిగిపోతున్నాయి.

"ఏరా బాబిగా చూశావంట్రా నేను చెప్పినట్టే అప్పానగరం బస్తీ ఎలా నాశనమయిందో"

"ఔనన్నా. ఎంత చక్కగా ప్లానేసి ఆ కాలనీని నేలమట్టం చేశారో చూశావా. ముందేమో అక్కడి దండోరావాళ్లని రెచ్చగొట్టి దాడులు చేయించారు. తర్వాత భూషయ్యగారి మనుషులు దిగి మొత్తం కాలనీ నేలమట్టం చేసేశారు. కొంతమంది ముసలోళ్లు, పిల్లలూ పోయారు. అయితేనేం, అతి తక్కువసేపులో కాలనీ మొత్తం బూడిదైపోయింది. ఇళ్లు కూలినవాళ్లందరికీ భూషయ్యగారి మనుషులు ఆహారం పొట్లాలిచ్చారు కూడా. ఇంక ఆ లక్ష్మయ్యగాడికి నగరంలో స్థావరాలు లేనట్టే."

"పోలీసు కమీషనర్ కోపీల అన్నమయ్య కూడా మిన్నకుండిపోయారు. ప్రాణనష్టం లేకుండా జాగ్రత్తగా ధ్వంసం చేయమన్నారు"

"మరి లక్ష్మయ్య దొరకలేదుగా. దీనివల్ల భూషయ్యగారికి ఒరిగిందేమిటి."

"ఓరి పిచ్చోడా, బీరం లక్ష్మయ్య దొరికాడా లేదా అన్నది సమస్యకాదు. ఊరి మీద భూషయ్యగారి పట్టు సడలలేదని నిరూపించడం ముఖ్యం. ఆయనకు కోపం తెప్పిస్తే ఎన్ని కష్టాలొస్తాయో అప్పానగరంకే కాదు ఊరంతటికీ తెలిసొచ్చింది. పనిలో పనిగా తన పెంటపాడు ఫ్యాక్టరీలో తయారైన మందుగుండు సామాను సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో టెస్టు చేసుకున్నారు"

"మరింకేమీ లాభాలు లేవంటావాన్నా"

"లేకేం, అప్పానగరం కాలనీ ఇప్పుడు భూషయ్యగారు కబ్జా చేసినట్టే. దాన్ని ప్లాట్లు గడతారో లేక ఓ కాంప్లెక్సు కట్టి అందులో బ్రాంచి ఆఫీసు తెరుస్తారో ఆయనిష్టం"

"మరింతకీ గూండాయిజం సమసిపోయినట్టేనా"

"అదసలు సమస్యేకాదు. గూండాయిజం కొనసాగితేనే భూషయ్యగారికి మనుగడ."

●